చినుకు పడితే కానూరు చిత్తడే!

- వర్షానికి రోడ్లు గుంతల మయం
- డ్రెయినేజీలు అస్తవ్యస్తం
- అవస్థలు పడుతున్న జనం





కానూరు ప్రధాన రహదారులపై వర్షపు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పెనమలూరు/కంకిపాడు:కానూరు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కూటమి పాలకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ తుస్సు మంది. గ్రామంలో గుంతలతో రోడ్లు, డ్రెయినేజీ సక్రమంగా లేక మురుగనీరు విలయ తాండంవంతో పరిస్థితి అధ్వానంగా మారిపోయింది. కానూరు గ్రామంలో ప్రధాన రహదారి కామయ్యతోపు బందరు రోడ్డు నుంచి గ్రామంలోకి దాదాపు 2 కిలోమీటర్ల మేరకు ఉంది. ఆ పైన రోడ్డు ప్రసాదంపాడు వరకు ఉన్న ప్రధానంగా గ్రామంలో మొదటి 2 కిలోమీటర్ల రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్రాంతి పండుగ కల్లా రోడ్లు అద్దంలా వేస్తామని ఊగిపోతూ ప్రజలకు హామీలు ఇచ్చారు. ఇక అధికారంలోకి రాగానే తూతూ మంత్రంగా రోడ్డు మరమ్మతులు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. అయితే చాలా రోజుల తరువాత ఎదురు చూడగా గురువారం రాత్రి వర్షం కురిసింది. అందరు వాతావరణ చల్లబడిందని ఎంతో ఆనందం పడ్డారు. తీరా తెల్లవారు చూసేసరికి గ్రామస్తులు గుండె గుబేలుమంది.

గుంతల మయంగా రోడ్డు......

రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే కానూరులో రోడ్లు మోకాలి లోతు గుంతలు పడ్డాయి. మురుగు నీరు నేరుగా రోడ్డు పైకి వచ్చి నిలిచి పోయింది. పంటకాలువ రోడ్డు నుంచి కెనడీ పాఠశాల వరకు రోడ్డు పూర్తిగా నీటిలో మునిగి పోయింది. ఇటీవల వేసిన రోడ్డు లేచిపోయి గుంతలు పడ్డాయి. నడవటానికి కూడా వీలు లేకుండా రోడ్డు దారుణంగా మారింది. రోడ్డు వేసిన కొద్దిరోజులకే రోడ్డు గుంతల మయంగా మారటంతో రోడ్డు నిర్మాణం పనిలో డొల్లతనం బట్టబయలైంది.

డ్రెయినేజీ నిర్మాణం మాయ.....

కానూరులోని ప్రధాన రహదారి పక్కన నిర్మించిన డ్రెయినేజీ అంతుపట్టకుండా ఉంది. హడావుడిగా కొంత మేర డ్రెయినేజీ పనులు చేసి మధ్యలో అర్ధంతరంగా వదిలేశారు. దీంతో నీరు పారుదల లేక



రహదారిపై డ్రెయినేజీ మురుగు

నేరుగా మురుగునీరు రోడ్డు పైకి వచ్చి నిలిచిపోయాయి. దీంతో తీవ్ర దుర్గంధంతో గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు మరీ దారుణంగా మారి రోడ్ల పైకి మురుగునీరు ప్రవహిస్తుంది.

భారీ వర్షాలు పడితే.......

కానూరులో భారీ వర్షం పడితే పరిస్థితి ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. చిన్నిపాటి వర్షానికే గ్రామంలో దయనీయ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇక భారీ వర్షం పడితే గ్రామస్తులు ఎక్కడ ఉండాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ అవసరమున్న ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయాలని, నేతల కాంట్రాక్టుల కోసం ప్రాధాన్యత లేని ప్రాంతాల్లో రోడ్లు వేస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

రహదారులపైనే డ్రెయినేజీ మురుగు

కంకిపాడులో డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. రహదారులను ముంచెత్తుతున్నాయి. డ్రెయినేజీ మురుగు గుండా రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కంకిపాడులో నెలకొన్న ఈ దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది. సుమారు 40 గ్రామాలకు కంకిపాడు పట్టణం ప్రధాన కూడలి. గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల్లోని పలు గ్రామాల నుంచి ప్రజలు నిత్యం ఈ ప్రాంతానికి వస్తుంటారు. ప్రధానంగా ఎరువులు, దుస్తులు, బంగారు ఆభరణాలు, కూరగాయల కోసం వచ్చి పోతుంటారు. ఇంతటి ముఖ్యమైన ఈ ప్రాంతంపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించటంతో ప్రజలు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రధాన సెంటరులోని బస్టాండులోని డ్రెయినేజీ తూములు ధ్వంసమై మురుగు బస్టాండులోకి ప్రవేశిస్తోంది. బస్టాండులోకి వచ్చిపోయే ప్రయాణికులు మురుగులో రాకపోకలు సాగించలేక అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య రోజులు తరబడి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు గన్నవరం రోడ్డులోని ఓ అంతర్గత రోడ్డు వద్ద మురుగునీటి పారుదలకు వీలుగా ఏర్పాటుచేసిన సిమెంటు తూము ధ్వంసమైంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మురుగు నేరుగా గన్నవరం రోడ్డుపైకి ప్రవహిస్తుంది. రహదారి మార్జిన్‌లను మురుగు ముంచేస్తుంది. చెన్నకేశవ స్వామి దేవస్థానంలోని డ్రెయిను సైతం పొంగి రోడ్డుపై మురుగు ప్రవహిస్తుంది. ప్రధాన సెంటరు, ప్రధాన రహదారులు, దేవస్థానాల సమీపాల్లో మురుగు పొంగిపొర్లుతుండటంతో ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. నిత్యం అధికారులు ఆయా మార్గాల గుండా రాకపోకలు సాగిస్తున్నా ప్రజల ఇబ్బందులను పరిష్కరించటంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడపా దడపా



మాణిక్యనగర్‌లో గుంతలు

కురుస్తున్న వర్షాలు తోడవ్వటంతో మురుగు, వర్షం నీరు కలిసి రోడ్లపై ప్రవహిస్తూ పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజారోగ్య సమస్య తలెత్తక ముందే అధికారులు స్పందించి మురుగు ఇబ్బందులు తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయింపు



గన్నవరం:మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అమోదం తెలుపుతూ పాలకవర్గం తీర్మానాలు చేసింది. గ్రామ శివారు చెంచులకాలనీ పరిధిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పది సెంట్లు స్థలం కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాలని, హెచ్‌సీఎల్ పక్కన మురుగుకాలువను సీసీ డ్రెయిన్‌గా నిర్మాణం చేయాలని తీర్మానించారు. ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు శొంఠి కిషోర్, పంచాయతీ కార్యదర్శి సీవీ ఎల్ఎన్ఆర్‌వీ. ప్రసాద్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



హనుమాన్‌జంక్షన్ రూరల్:ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో జరిమానా విధించక తప్పదని ఎస్‌ఐ వి. సురేష్ హెచ్చరించారు. స్థానిక విజయవాడ రోడ్డులో శుక్రవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను పరిశీలించారు. పట్టణంలోని ముఖ్య రహదారుల్లో అతి వేగంతో విచ్చలవిడిగా బైక్‌లు నడుపుతున్న యువకులకు ఎస్‌ఐ సురేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా నడుతున్న వ్యక్తులకు, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లష్యంగా దిచక్రవాహనాలు నడుపుతున్న వ్యక్తులకు ఆయన జరిమానా విధించారు.

క్లుప్తంగా

అధ్యాపకుల అభివృద్ధిపై శిక్షణ



రామవరప్పాడు(విజయవాడరూరల్):ఎనికెపాడులోని ఎస్ఆర్‌కే ఫౌండేషన్ వారి విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ ఆధ్వర్యంలో అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.హరిశంకర్, డాక్టర్ బి.కిరణ్ కుమార్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ నుంచి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ స్వాతి పుట్ట, డాక్టర్ కె.ఈశ్వర్ కుమార్ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ హరిశంకర్ మాట్లాడుతూ అధ్యాపకులకు వృత్తిపరమైన నైపుణ్యాలను, బోధనా పద్ధతులను మెరుగు పరచుకోవడానికిఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు సాంకేతికత అంశాలపై శిక్షణ పొంది విద్యార్థులకు మరింత సమర్థవంతంగా బోధించడానికి ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఈశ్వర్ కుమార్ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత, డాక్టర్ బి. భవాని డాక్టర్ అశోక్ కృష్ణన్ కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాల సంరక్షణ



కంకిపాడు: నట్టల నివారణతో జీవాల సంరక్షణ సాధ్యమవుతుందని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు గ్రామంలో నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జీవాలకు నట్టల మందు వేశారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో నులి పురుగులను నిర్మూలించటం ద్వారా వాటి ఎదుగుదల ఆశాజనకంగా ఉంటుందన్నారు. నట్టల నివారణ మందుతో జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని చెప్పారు. సీజన్‌కు అనుగుణంగా సంక్రమించే వ్యాధులు పట్ల అవగాహన కల్పించుకోవాలని సూచించారు. జీవాల సంరక్షణను సమర్థంగా చేపట్టడం ద్వారా పెంపకం లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కె.మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిపాజిటర్ల ఎడ్యుకేషన్‌పై మహిళలకు వర్క్‌షాపు



గన్నవరం:స్థానిక మహిళా సాధికార కార్యాలయంలో శుక్రవారం సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సేవా సంస్థ (ఆర్టిడ్స్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీపై రుణాలు, బ్యాంక్ ఖాతాల నిర్వహణపై రిసోర్స్ పర్సన్ కాళహస్తి వివరించారు. డిపాజిటర్ల హక్కులు, బ్యాంకింగ్ మోసాలు, సైబర్ నేరాలు, కేవైసీ ఆవశ్యకత, పొదుపు ప్రాముఖ్యతను మరో రిసోర్స్ పర్సన్ ఆర్ఎస్. శంకరరావు అవగాహన కల్పించారు. ఆర్టిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, కార్యదర్శి వై. సాంబశివరావు, ఏపీఎం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



తేలప్రోలు(గన్నవరం):ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఐఎస్ఓ (21001-2018) గుర్తింపు లభించినట్లు ఆ కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఐఎస్ఓ ప్రతినిధి హరగోపాల్ నుంచి ఆయన సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యతా ప్రమాణాలను గుర్తించి ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను అందజేయడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఐఎస్ఓ కోఆర్డినేటర్ ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గంగూరులో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలి

జెడ్పీ సీఈవో కన్నమ నాయుడు

పెనమలూరు:గంగూరు గ్రామంలో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.కన్నమనాయుడు ఆదేశించారు. ఆయన శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రావటంతో గురువారం డీపీవో అరుణ పర్యటించారు. ఆమె అసంతృప్తి వ్యక్తం చేయటంతో శుక్రవారం సీఈవో కన్నమనాయుడు రంగంలోకి దిగారు. గ్రామంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త కుప్పలు కనబడరాదన్నారు. ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని తెలిపారు. దీనికి గ్రామస్తులు మాట్లాడుతూ చెత్త సేకరణ సక్రమంగా జరగటం లేదని



గంగూరు గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఈవో కన్నమనాయుడు

సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పీఎస్‌వీఎస్ ప్రకాష్‌నాథ్ పాల్గొన్నారు.

పంట కాల్వ కలుషితంపై గ్రామస్తుల ఆందోళన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పంట కాల్వ మురుగు కాల్వగా మారింది. గ్రామ పంచాయతీ డ్రెయినేజీ మురుగు మొత్తం పంట కాల్వలోకి పెడుతుండటంతో కాల్వ కలుషితమైంది. ఏళ్ల తరబడి నున్న గ్రామంలోని ప్రజానీకానికి గొల్లపూడి నుంచి వచ్చే కృష్ణానది నీటిని ఇసుక ఫిల్టర్ బెడ్స్ ద్వారా ఫిల్టర్ చేసి పంచాయతీ తాగునీరుగా సరఫరా చేస్తోంది. గత రెండు సంవత్సరాలుగా మైక్రోఫిల్టర్ ద్వారా ఫిల్టర్ చేసి గ్రామంలోని మినీ ట్యాంకులకు సరఫరా చేసి గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. పంట కాల్వలో మురుగు కలవడం వల్ల కాల్వ కలుషితమవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాల్వను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీపై ఉందని గ్రామస్తులు అంటున్నారు. బోడపాడు, అపార్టుమెంట్ల నుంచి వస్తున్న డ్రెయినేజీ



పంట కాల్వలో మురుగు ప్రవాహం

మురుగు నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా నిర్మించి మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాయతీతోనే ఉద్యోగులకు గుర్తింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్:విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయతీ కనబర్చిన ఉద్యోగులకు ప్రజల్లో ఎల్లప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.చిన్న నరసింహులు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని బాపులపాడు ఏరియా ప్రభుత్వ పశు వైద్యశాలలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పశుపోషకులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడూ తగిన సూచనలు, సలహాలు, పశు వైద్య సేవలు అందించటం ద్వారా వారి మన్ననలు పొందవచ్చని చెప్పారు. పశుపోషణే రైతులకు ముఖ్య ఆదాయ వనరుగా ఉందని తెలిపారు. పశువుల పెంపకం లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, రాయితీలను రైతులకు అందించటంలో క్షేత్రస్థాయి ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన పశు సంవర్ధక శాఖ ఉద్యోగులను ఆయన శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రమోహన్, బాపులపాడు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమీలారాణి పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను సత్కరిస్తున్న డాక్టర్ చిన్న నరసింహులు

పంచాయతీ కార్మికుల జీవనం దుర్భరం

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు

కంకిపాడు: పంచాయతీ కార్మికుల జీవనం దుర్భరంగా తయారైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచిపోతున్నా ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి మాత్రం పాలకుల ప్రచారానికే పరిమితం అయ్యిందన్నారు. అభివృద్ధికి ఆయా వర్గాలు నోచుకోవటం లేదని వాపోయారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు పాటుపడే కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల అభ్యున్నతి దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం కార్మికులకు రూ.25 వేలు అందించాలని కోరారు. బీమా సదుపాయం కల్పించాలన్నారు. బీమా సొమ్ము కార్మికుల జీతాల నుంచి కాకుండా ప్రభుత్వమే భరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఉన్నా కార్మికుల సంక్షేమం ప్రశ్నార్థకంగా మారుతుందని, పాలకుల తీరు మారాలని, సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

కోరం లేక సమావేశం వాయిదా

విజయవాడరూరల్: కోరం లేకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. 40 మంది ఎంపీటీసీ సభ్యులున్న మండల పరిషత్ పాలక వర్గంలో మూడో వంతు సభ్యులు కూడా హాజరుకాక పోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి తెలిపారు.

జ్ఞానమణికి అభినందనలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కైలే జ్ఞానమణికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఎంతో క్రియాశీలకంగా పనిచేస్తున్న కైలే జ్ఞానమణికి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కటంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం కలుగుతుందన్నారు. బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలిగా, మహిళా విభాగం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షురాలిగా గతంలో సమర్థవంతంగా సేవలు అందించిన జ్ఞానమణి నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై జ్ఞానమణి చిత్తశుద్ధితో పోరాటం సాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు చెన్నుబోయిన శివయ్య, కొమరవల్లి థామస్, గూడవల్లి రత్న సుధాకర్, కొల్లి సుబ్రహ్మణ్యం (చిట్టి) పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని వినతి



పెనమలూరు:అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటర్మీడియెట్ ప్రాంతీయ అధికారి (ఆర్ఐవో)కు పీడీఎస్‌యు నేతలు వినతిపత్రం అందచేశారు. కానూరులో శుక్రవారం ఆర్ఐవోకు ఫిర్యాదు చేసిన పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ శ్రీచైతన్య, నారాయణ, ఎస్ఆర్, భాష్యం, గోసాలైట్స్ వంటి కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అధిక ఫీజుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు, డ్రస్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఒక బ్రాంచికి అనుమతులు తీసుకొని మరికొన్ని బ్రాంచ్‌లు నడుపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కాలేజీల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన

గన్నవరం:స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ కాంస్య విగ్రహాలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దాసరి వెంకటబాలవర్ధనరావు, మూల్పూరు బాలకృష్ణారావుతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భూమిపూజలో పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకువెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, రంగారావు, మాజీ సర్పంచి తుల సిమోహన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాసరనేని రంగబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న యార్లగడ్డ, దాసరి

రైతు సమ్మేళనం....

స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో శుక్రవారం శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, మాంస పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రైతు సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్. జవహర్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. జాతీయ పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ బాల్‌బుద్దే, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్, కిసాన్ మేళా సమన్వయకర్త డాక్టర్ సిహెచ్. వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బాబుల కోసం తనిఖీలు

పెనమలూరు:మండల పరిధిలో గంజాయి విక్రయం, సేవించే వారి కోసం పోలీసులు శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారంతో ఎస్పీ గంగాధరరావు ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. గంజాయి సేవించిన వారు రాత్రి సమయలలో రెచ్చి పోయి ప్రయాణికులపై దౌర్జన్యాలు చేస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో పోలీసులు యనమలకుదురు లంకలు, తాడిగడప శివారు, వణుకూరు జగనన్నకాలనీ, పోరంకి, పెనమలూరు, పెదపులిపాక ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గ్రామాల శివారు ప్రాంతాల్లో తిరిగుతున్న యువకుల వాహనాలు క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్:అసాంఘిక కార్యకలాపాలు, మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కేఎస్ఎస్‌వీ సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వే స్టేషన్, సూరమ్మ చెరువు ఏరియాల్లో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ వి.సురేష్ నేతృత్వంలోని పోలీసు బృందాలు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆకతాయి యువకులు, అనుమానాస్పద వ్యక్తులు ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదు వస్తున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు.



తాడిగడప శివారులో యువకులను తనిఖీ చేస్తున్న పోలీసులు



అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీనిధి పథకంపై బీహార్ ప్రభుత్వ బృందం అధ్యయనం

హనుమాన్‌జంక్షన్ రూరల్:మహిళల స్వయం ఉపాధి కల్పన, జీవనోపాధి కోసం డ్వాక్రా సంఘాల ద్వారా అందిస్తున్న శ్రీనిధి రుణాల ప్రక్రియను అధ్యయనం చేసేందుకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం బాపులపాడు మండలంలో శుక్రవారం పర్యటించింది. శ్రీనిధి పథకం విధివిధానాలు, అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తొలుత బీహార్ బృందం సభ్యులు సతీష్ రీచాగార్గి, అనీషా మండలంలోని మల్లవల్లిలో పర్యటించారు. శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు బంగారమ్మ, జనరల్ మేనేజర్ సిద్ధి శ్రీనివాసరావులు బీహార్ బృందం సభ్యులకు ఈ పథకం గురించి వివరించారు. శ్రీనిధి రుణాల దరఖాస్తు విధానం, అర్హుల ఎంపిక, రుణ మంజూరు, రికవరీ పద్ధతులను తెలియజేశారు. శ్రీనిధి రుణాల ద్వారా మహిళలు నిర్వహిస్తున్న వివిధ స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. మహత్మాగాంధీ నగర్‌లోని మండల మహిళా సమాఖ్య భవనంలో రుణాల ప్రాసెసింగ్ విధానాన్ని బృందంలోని సభ్యుల పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఏజీఎం మునిరత్నం, మేనేజర్ కిరణ్, పలువురు సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



మల్లవల్లిలో డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న బీహార్ రాష్ట్ర ప్రతినిధులు